## క్లుప్తంగా

### రామాలయంలో మంత్రి జూపల్లి పూజలు



కొల్లాపూర్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దేవతామూర్తులను దర్శించుకుని ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని, భగవంతున్ని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కాంక్షించారు. మంత్రి వెంట నాగరాజు, నర్సింహరావు, రహీంపాష, దిలీప్ శెట్టి, వెంకటయ్య ఉన్నారు.

### ఎస్పీ ప్రత్యేక పూజలు



చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రా స్వామి బ్రహోత్సవాల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం కల్యాణ వేడుక అనంతరం నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి చైర్మన్ రామశర్మ, అర్చకులు సన్మానించారు. అనంతరం కల్యాణోత్సవం ప్రశాంతంగా నిర్వహించినందుకు పోలీసులను అభినందించారు. వారం రోజులపాటు జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సూచించారు. వారి వెంట సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

### రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు సన్మానం



వెల్దండ: మండలంలోని చెదురుపల్లికి చెందిన ఆర్మీ జవాన్ కుచెలుడు రిటైర్డ్ అయ్యారు. బుధవారం బస్టాండ్ ఆవరణలో మాజీ ఆర్మీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుచెలుడు దంపతులను పూలమాలలు, శాలువాలతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, రామకృష్ణ, వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

### కూలిలు వెంటనే చెల్లించండి



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కొన్ని నెలలుగా పనిచేస్తున్నా డబ్బులు చెల్లించడం లేదని కూలీలు ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీఓకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి కనీసం రోజువారి కూలి రూ.400 నుండి రూ.500 ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

### ప్రమాదవశాత్తు గడ్డి దగ్ధం

తాడూరు: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమై రూ.35వేల ఆస్తినష్టం కలిగిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సామేలు 3 ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేశారు. ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకొస్తున్న క్రమంలో గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఫైర్ సిబ్బంది చేరుకున్నప్పటికి గడ్డి మాత్రం కాపాడలేకపోయారు. దీంతో గడ్డి కాలిబూడిదైంది.

### సామాజిక తనిఖీ గ్రామసభలు

లింగాల: మండలంలో పలు గ్రామాలలో బుధవారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలను నిర్వహించారు. దత్తారం, మగ్దూంపూర్, శాయిన్‌పేట, శ్రీరంగాపూర్, క్యాంపురాయవరం, రాంపూర్, చెన్నంపల్లి, అవుసలికుంట, మల్లోనిచెర్వుతండా, కొత్తచెర్వుతండా పంచాయతీ కార్యాలయాల ఆవరణలో గ్రామ సభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం వారు ఆయా గ్రామాలలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన పనులను సమీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, తనిఖీ సభ్యులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ఏర్పాటు

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. అటువైపు వెళ్లే ప్రయాణికులతోపాటు ఉపాధి కూలీలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. శ్రీను, అంజి, సతీష్, సుల్తాన్, ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.



వెల్దండలో కల్యాణోత్సవంలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వట్టెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



ఉప్పునుంతల కేదరేశ్వరాలయంలో సీతారాముల వారి కల్యాణం

# కనులపండువగా కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో శ్రీరామనవమి సంబరం అంబరాన్ని తాకింది. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు పూజలు చేయగా, మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదమంత్రోచ్చరణలు, తరలివచ్చిన భక్తజనం మధ్య సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల కమిటీ బాధ్యులు, అధికారులు, నాయకులు పలుచోట్ల ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల నిర్వహించిన శోభాయాత్రలు అకట్టుకున్నాయి.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణ మండపంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సాగిన ఈ కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు సమర్పించారు. వీరితో పాటు హైకోర్టు న్యాయమూర్తి మాధవీలత దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆ రాములోరికి కోరుకున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


■ తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాల్లోని పోతిరెడ్డిపల్లి, గంగారం, వట్టెం, పాలెం, ఆవంచ, వెల్గొండ సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు.

■ ఉప్పునుంతల కేదార్వేశరాలయం, కంసానిపల్లి శ్రీరామ గట్టుపై, మామిళ్లపల్లి, వెల్టూరు, తిప్పాపూర్, అయ్యవారిపల్లి, పెనిమిళ్ల ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. కాంసానిపల్లి సమీపంలోని శ్రీరామ గట్టుపై కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది.

■ ఈగలపెంట టీఎస్ జెన్‌కో కాలనీలోని సాయిబాబ మందిరం, దోమలపెంట కోదండరామాలయంలో గణపతి, వాస్తు, శ్రీరామ హోమం, ఎదుర్కోలు నిర్వహించారు.



జిల్లా కేంద్రంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు, హైకోర్టు న్యాయమూర్తి మాధవీలత దంపతులు



కల్వకుర్తిలో తాళిని చూపిస్తున్న పూజారి

■ పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, జటప్రోల్, గోపులాపూర్, కొండూరు వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. మంచాలకట్టలో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణానికి గ్రామస్తులు భారీగా హాజరయ్యారు.

■ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల రామాలయం, ఎన్మన్‌బెట్ల, ఎల్లూరులో కల్యాణం నిర్వహించారు.

■ కోడేరుతో పాటు ఎత్తం, నర్సాయిపల్లి, తీగలపల్లి, మైలారంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజాలు అనంతరం తీర్థ ప్రసాదలు అందజేసినట్లు అర్చకుడు రాఘవేంద్ర శర్మ తెలిపారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని శివాంజనేయ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాలు, చంద్రకల్, పెద్దకార్పాములలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

■ అమ్రాబాద్, పదరతో పాటు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్రాబాద్ కోదండరామాలయం, పదర మండలం మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణం కనులపండువగా నిర్వహించారు.

■ కొండనాగుల, బల్మూర్, తుమ్మెన్‌పేట, గోదల్, రాంనగర్, రామాజిపల్లి ఆలయాల్లో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహలు పల్లకీలో ఊరేగించారు.

■ తెలకపల్లిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు నడిగడ్డ, కార్వంగ, చిన్నముద్దునూర్, రాంరెడ్డిపల్లి, గడ్డంపల్లి, ఆలేరు, అనంతరసాగర్, రాకొండలో కల్యాణోత్సవం అంగరంగవైభవంగా జరిగింది.

■ మన్ననూర్‌లోని అంబేద్కర్ కాలనీలోని కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

■ తాడూరు మండలంలోని గుట్టపల్లి, పాపగల్, శిర్సవాడ, ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లిలో కల్యాణం నిర్వహించారు.

■ వెల్దండ మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లి, కొట్ర, రాచూర్, చెదురుపల్లి కల్యాణోత్సవం నిర్వహించారు.

■ కల్వకుర్తి మండలంలోని తాండ్ర హనుమాన్ దేవాలయంలో కల్యాణోత్సవాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని హనుమాన్ మందిరంలో భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. సీతారాముల ఆలయానికి కల్వకుర్తి సగర సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

■ లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయ ప్రాంగణం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ప్రధాన అర్చకుడు రామాచారి ఆధ్వర్యంలో కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

■ అచ్చంపేట పట్టణంతో పాటు మండలంలోని దేవాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సిద్ధాపూర్ గుర్రాలగుట్టపై ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పలు ఆలయాల వద్ద మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు పూజలు చేశారు. అచ్చంపేట వాసవీకన్యకా పరమేశ్వరి, ఆంజనేయ అయ్యప్పస్వామి దేవాలయం, భ్రమరాంబ దేవాలయం, మారుతినగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణం జరిపించారు.

■ ఊరుకొండ మండలంలోని మాదారం, ముచరల్లపల్లి, రాంరెడ్డి పల్లి, జకినాలపల్లి, ఊరుకొండపేటలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ సన్నిధిలో కల్యాణం జరిపించారు.



అచ్చంపేట మండలం సిద్ధాపూర్ గుర్రాలగుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



లింగాలలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



జిల్లా కేంద్రంలో కల్యాణానికి హాజరైన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తదితరులు



కోడేరులో..



తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో..



కొండనాగులలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



దోమలపెంటలో విగ్రహాలను ఊరేగిస్తున్న సీఈ సూర్యనారాయణ



తాడూరులో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న పూజారి



అచ్చంపేట భ్రమరాంబ ఆలయంలో..



అమ్రాబాద్ కోదండరామాలయంలో..



మంచాలకట్టలో సీతారాముల కల్యాణం

# రైతుల కల సాకారమయ్యేనా?



మానువడ్డవాగు వద్ద గతంలో నిర్మించిన చెక్‌డ్యాం

అమ్రాబాద్: పదర మండలంలోని ఉడిమిళ్ల, మారడుగు గ్రామాల సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో మానువడ్డవాగు జీవనదిలాపారుతూ ఉంటుంది. ఈ నీళ్లు అడవి ప్రాంతం గుండా కృష్ణానదిలో కలుస్తాయి. 2003లో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు అక్కడ చెక్‌డ్యాం నిర్మించడంతో భూగర్భ జలాలు పెరిగి కొంత మేర రైతుల పొలాల్లో బోర్లలో సమృద్ధిగా నీరు వచ్చాయి. అనంతరం 2005లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పల్లెబాటలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రైతుల కోరిక మేరకు మానువడ్డవాగు ఎత్తిపోతల పథకం చేపడతామని హామీ ఇచ్చి రూ.2.30 కోట్లను నిధులు కేటాయించి సర్వే చేయించారు. అయితే మానువడ్డవాగు అటవీ ప్రాంతంలో ఉండటం వల్ల పనులు చేపట్టేందుకు అటవీశాఖ అధికారులు అడ్డు చెప్పడంతో పనులు ప్రారంభం కాలేదు. సాగునీటికోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం హయాంలోనైనా మానువడ్డవాగు నిర్మాణం జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. 2005లో మానువడ్డ నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మరోసారి ఎమ్మెల్యే కావడంతో మానువడ్డవాగు నిర్మాణం చేపడతారని ఆశలు చిగురించాయి.

**బీడు భూములు సాగులోకి వస్తాయి**



మానువడ్డవాగు నిర్మాణం చేపడితే ఈ ప్రాంత బీడు పొలాలు సాగులోకి వస్తాయి. ఇక్కడ నీటి వసతిలేక వర్షధార పంటలు మాత్రమే సాగు చేస్తున్నాం. ఇక్కడ వ్యవసాయం తప్పా వేరే ఉపాధి లేదు. ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి తోనే మానువడ్డవాగు ఎత్తిపోతల పనులు పూర్తయ్యేందుకు అవకాశం ఉంది.

– బీక్యానాయక్, మాజీ సర్పంచ్, గానుగుపెంట

**ఆరు గ్రామాలకు ప్రయోజనం..**

మానువడ్డవాగు ఎత్తిపోతలు చేపడితే పదర మండలంలోని ఉడిమిళ్ల, మారడుగు, ఇప్పలపల్లి, చిట్లంకుంట, మద్దిమడుగు, గానుగుపెంట ఆరు గ్రామాలలో సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ గ్రామాలలో శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుంది. దీంతో పాటు ఎగువన ఉన్న వంకేశ్వరం, చెన్నంపల్లి తదితర గ్రామాలలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని మానువడ్డవాగు ఎత్తిపోతలకు కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమ్రాబాద్: ఓటు హక్కు వినియోగంలో ప్రలోభాలకు గురికావద్దని జైభారత్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలు, నేతలు ఎన్నికలు వచ్చిన సమయంలో ఎన్నో హామీలు ఇవ్వడంతో పాటు డబ్బు, మద్యంతో లొంగదీసుకుంటారని, అలా లొంగితే అవినీతికి పాల్పడమని మనమే లైసెన్స్ ఇచ్చినట్లవుతుందని వివరించారు. నిర్భయంగా మంచి నాయకునికి ఓటు వేయాలని సూచించారు. లింగం, వెంకటయ్య నాసరయ్య, బాలకిష్టయ్య, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి బండలాగుడు పోటీలు

ఉప్పునుంతల: స్థానిక కేదారేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం నుంచి రెండు రోజుల పాటు అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్త పెద్ద జంగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న జూనియర్ విభాగంలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20వేలు, రూ. 10 వేలు, అందజేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 19 శుక్రవారం సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ. 60 వేలు, రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20వేలు బహుమతులు ఇస్తామని వివరించారు. వివరాల కోసం సెల్: 9640772356, 9440827904 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## వేడుకల్లో జేబుదొంగల చేతివాటం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని రామాలయంలో బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. కల్యాణానికి హాజరైన భక్తుల జేబుల నుంచి డబ్బులు చోరీ చేస్తుండగా గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్థానిక స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## సారా స్వాధీనం

బల్మూర్: మండలంలోని పోలీశెట్టిపల్లి స్టేజీ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై సారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. బైక్‌పై శ్రీను అనే వ్యక్తి 10 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేసి అతనిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

కల్వకుర్తి: పార్లమెంట్ ఎన్నికలలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ నాయకులు ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. మక్బుల్, ఇంతియాజ్ ఖాన్, నిజాం, ఎజాస్, అయూబ్ ఖాన్, ఖాజా తదితరులు ఉన్నారు.

## రోడ్డుకు ఇరువైపుల ముళ్లచెట్లు



బల్మూర్: మండల కేంద్రం నుంచి గోదల్ వెళ్లే పీఆర్ రహదారికి ఇరువైపుల ప్రమాదభరితంగా మారిన ముళ్ల చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి కొమ్మలు వాలడంతో వాహనదారులకు తగులుతున్నాయని, దీంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉందని వాపోతున్నారు. మండల కేంద్రం బల్మూర్ గోదల్ వరకు కంప చెట్లు రోడ్డుపై అల్లుకుపోయి ఉన్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కే లేదని విమర్శిస్తున్నారు. వెంటనే పీఆర్ అధికారులు స్పందించి ముళ్ల చెట్లను తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.